

జాతర ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

## భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

- ఎస్పీ రాహుల్ హెగ్డే
- మేళ్లచెర్వు మహా శివరాత్రి జాతర ఏర్పాట్ల పరిశీలన

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 15 : స్థానిక స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12 వరకు జరుగనున్న మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే సిబ్బందికి సూచించారు. గురువారం ఆలయ ఆవరణలో క్యూలైన్లు, పరిసరాలను ఆయన పరిశీలించారు. ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డిని జాతర ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గ్రామ పరిసరాల్లో పార్కింగ్ ప్రదేశాలకు అనువైన స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌మీనా, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐలు పరమేశ్, సురేశ్‌యాదవ్ ఉన్నారు.

## నేడు సూర్య దేవాలయంలో రథ సప్తమి వేడుకలు

అర్వపల్లి, ఫిబ్రవరి 15 : మండలంలోని తిమ్మాపురంలో గల అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రం శ్రీపురంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు జరుగనున్నాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం 4 గంటలకు స్వామికి సుప్రభాత సేవ, అలంకరణ, అభిషేకం నిర్వహించనున్నారు. 5.30 నుంచి స్వామి దర్శనానికి భక్తులకు అనుమతిస్తారు. మధ్యాహ్నం అన్న వితరణ చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు స్వామి కల్యాణాన్ని జరిపించనున్నారు. ఉషోదయ వేళ సూర్య కిరణాలు స్వామి వారి పాదాలను తాకనున్నాయి. వేడుకలకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, హిందూ ధర్మ ప్రచారకుడు రాధా మనోహర్‌దాస్ హాజరు కానున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి కోరారు.



కోదాడ టౌన్ : కార్యక్రమంలో మాట్లాడుతున్న కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ



బొడ్రాయిబజార్ : సేవాలాల్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యాపేట ఆర్డీఓ కృష్ణయ్య

## సేవాలాల్ మహారాజ్ ఆశయాలు సాధించాలి

- కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ

కోదాడ టౌన్, ఫిబ్రవరి 15 : సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను సాధించాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. గురువారం పట్టణంలో ప్రభుత్వ పరంగా సేవాలాల్ జయంతిని నిర్వహించి మాట్లాడారు. గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. ప్రభుత్వం సేవాలాల్ జయంతికి గిరిజనులకు ప్రత్యేక సెలవు కేటాయించి సముచిత స్థానం కల్పించిందనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీలారమేశ్, ఎంపీపీ మల్లెల రాణి, జడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, ఎంఈఓ సలీంషరీఫ్ పాల్గొన్నారు.

**బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ : సూర్యాపేట ఆర్డీఓ కృష్ణయ్య**

బొడ్రాయిబజార్ : బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమని సూర్యాపేట ఆర్డీఓ సీహెచ్.కృష్ణయ్య అన్నారు. స్థానిక బంజారా భవన్‌లో గురువారం నిర్వహించిన సంత్ సేవాలాల్ 285వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనులను ఐక్యంగా ఉంచేందుకు సేవాలాల్ ఎనలేని కృషి చేసినట్లు కొనియాడారు. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రభుత్వం ఆప్షనల్ హాలిడేగా ప్రకటించడం హర్షణీయమన్నారు. అంతకు ముందు భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరావత్ కుమారిబాబునాయక్, సూర్యాపేట తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ కన్వీనర్ దరావత్ వీరన్ననాయక్, లునావత్ పాండూనాయక్, భిక్షం నాయక్, ధరావత్ అజయ్‌నాయక్, నాగూనాయక్, బాలూనాయక్, దారాసింగ్, లచ్చిరాం, లాలు, వెంకన్న, వస్త్రం, రఘుపతి, మోతిలాల్, హుస్సేన్, గోపినాయక్, మంగ్తానాయక్ పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలోని నాణ్యతండా గ్రామ పంచాయతీలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్యానాయక్, గుగులోతు రాములు, రమేశ్, మహేశ్, కిష్ట, వంశీ, మోతిలాల్, వెంకన్న, పాండు పాల్గొన్నారు.

తుంగతుర్తి : సంత్ సేవాలాల్ మార్గంలో గిరిజనులు నడుచుకోవాలని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధాకిషన్‌రావు అన్నారు. మండలంలోని దేవునిగుట్టతండాలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించి అనంతరం కాంగ్రెస్ నాయకులను శాలువాతో సన్మానించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గిరిజనుల ఆదేశాల మేరకు సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలి

మేళ్లచెర్వు : మండల కేంద్రంలో ఈ నెల 19న నిర్వహించే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ రవీందర్‌నాయక్ అన్నారు. ఈ మేరకు వేడుకకు హాజరు కావాలని కోరుతూ తాసీల్దార్ జ్యోతి, ఎస్ఐ పరమేశ్‌కు సంఘ నాయకులతో కలసి ఆహ్వాన పత్రికలను అందించారు. కార్యక్రమంలో సేన మండలాధ్యక్షుడు బానోతు హుస్సేన్‌నాయక్ పాల్గొన్నారు.

పాలకవీడు : మండలంలోని చెర్వుతండాలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపాల్, ఎస్ఐ లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

మోతె : మండలంలోని రాంపురంతండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హలావత్ రామకోటినాయక్ పాల్గొన్నారు.

## కోదాడ మున్సిపల్ బడ్జెట్ రూ.37.40 కోట్లు



బడ్జెట్‌ను వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల

కోదాడ టౌన్, ఫిబ్రవరి 15 : కోదాడ మున్సిపల్ బడ్జెట్‌ను 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.37.40 కోట్లుగా ప్రవేశపెట్టారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి బడ్జెట్‌ను ప్రతిపాదించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అందులో గ్రీన్ బడ్జెట్ కింద రూ.2.42 కోట్లు, రోడ్లు, మురుగు కాల్వల కోసం రూ.17.55 కోట్లు, పారిశుధ్యానికి రూ.2.68 కోట్లు, విద్యుత్ చార్జీల చెల్లింపులు రూ.0.95 కోట్లు, సిబ్బంది జీతభత్యాలకు రూ.6.35 కోట్లు కేటాయించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేరేడుచర్ల మున్సిపల్ బడ్జెట్ రూ.24.18 కోట్లు



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్

నేరేడుచర్ల. ఫిబ్రవరి 15 : నేరేడుచర్ల మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ 2024-25 అంచనా బడ్జెట్ వివరాలను ఆయన కౌన్సిలర్లకు వెల్లడించారు. 24 కోట్ల,17లక్షల,90 వేల రూపాయలు మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ అంచనా కాగా రూ.20.10 కోట్లు సిబ్బంది జీతభత్యాలు, ఇంజినీరింగ్, నీటి సరఫరా, పారిశుధ్యం, ప్రజా ఆరోగ్యానికి అలాగే రూ.49 లక్షలు గ్రీన్ బడ్జెట్‌కు కేటాయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ సాధారణ ఆదాయం వివిధ పన్నుల రూపంలో రూ.1.58 కోట్లు వస్తుందని, నల్లా పన్నులు, లైసెన్స్‌ల రూపంలో రూ.31.10 లక్షలు, ఇతర ఆదాయాల ద్వారా రూ.19.98 కోట్లు లభించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్ మాట్లాడుతూ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కోరారు. ఏకవాఖ్య తీర్మానంతో బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సరిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

- ప్రజా సంఘాల నాయకులు



బొడ్రాయిబజార్ : పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 15 : ప్రధాని మోదీ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం జరిగే గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఢిల్లీలో రైతుల ఆందోళన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, దళిత బహుజన శ్రామిక రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల, భవన నిర్మాణ, హమాలీల కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని లింగంపల్లి, మాచనపల్లి, బిక్కుమళ్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు ఎస్కే బాబ్ జానీ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

నాగారం : భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా నాయకుడు పేర్ల నాగయ్య, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు వేర్పుల లక్ష్మయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య పాల్గొన్నారు.

మోతె : శుక్రవారం నిర్వహించే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, పెయింటింగ్ వర్కర్స్, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు గుంటగాని ఏసు, జంపాల స్వరాజ్యం పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను ప్రజలు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు ఎం.శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలోని సివిల్ సప్లై హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు.



ఇమాంపేటలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ రాజ్ అధికారి సురేశ్‌కుమార్

## గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం కల్పించాలి

- డీపీఓ సురేశ్‌కుమార్

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 15 : గ్రామాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి సురేశ్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని ఇమాంపేట గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీని పరిశీలించి ఎన్ని రకాల మొక్కలు పెంచుతున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ, ప్రత్యేక అధికారి కిరణ్మయి, కార్యదర్శి సునీల్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.

## మట్టపల్లిలో నృసింహుడి నిత్య కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, ఫిబ్రవరి 15 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నిత్యకల్యాణాన్ని అర్చకులు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి వేద మంత్రోచ్చరణ నడుమ పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు జరిపించారు. కార్యక్రమంలో దేవాలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ పాల్గొన్నారు.



జాతర వాల్ పోస్టర్, కరపత్రికను ఆవిష్కరిస్తున్న చైర్మన్ నర్సిరెడ్డి, కమిటీ సభ్యులు

## చీదెళ్ల జాతర పోస్టర్ ఆవిష్కరణ

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 15 : మండలంలోని చీదెళ్లలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ-గోపయ్య స్వామి జాతర ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రికలను ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, కమిటీ సభ్యులు గురువారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ నెల 22న శిఖర పోతురాజు. శ్రీచక్ర యంత్ర ప్రతిష్ఠాపన జరుగనుండగా 24నుంచి 29 వరకు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ సీతారాంరెడ్డి, వైస్ చైర్మన్ రాజీవ్‌గాంధీ, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

## మునగాల సీఐగా రామకృష్ణారెడ్డి బాధ్యతలు

మునగాల, ఫిబ్రవరి 15 : మునగాల సర్కిల్ సీఐగా రామకృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐని మునగాల, నడిగూడెం ఎస్ఐలు అంజిరెడ్డి, అజయ్ మర్యాదపూర్వకంగా కలిసి బొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ధర్మభిక్షం జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- నాయకులు



చౌటుప్పల్ : ధర్మభిక్షం గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చౌటుప్పల్, ఫిబ్రవరి15 : పట్టణ కేంద్రంలో దివంగత మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల కోసం ధర్మభిక్షం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బత్తుల లక్ష్మయ్యగౌడ్, ఊడుగు శ్రీనివాస్‌గౌడ్, తొర్పునూరి వెంకటేశ్‌గౌడ్, చెవ్వగోని వెంకటేశ్ గౌడ్, ఊడుగు మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు యాదయ్య, సీపీఐ మండల కార్యదర్శి గోదల నాగభూషణం, పట్టణ కార్యదర్శి మిర్యాల కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని జయరాములు గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బీసు చందర్‌గౌడ్, గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నర్సయ్యగౌడ్, ఎంపీపీ మంగమ్మ పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలో ధర్మభిక్షం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, పట్టణ కార్యదర్శి సమ్మయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : ధర్మభిక్షం ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య అన్నారు. ధర్మభిక్షం జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, మోత్కూరు సొసైటీ అధ్యక్షుడు బీసు సత్తయ్య, సీపీఐ మండల కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు.

## టెన్నికాయిట్ నేషనల్ మీట్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని కావేరిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి

నడిగూడెం, ఫిబ్రవరి 15 : నడిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని కావేరి టెన్నికాయిట్ నేషనల్ మీట్‌లో ప్రతిభ చూపి మిక్స్‌డ్ డబుల్స్‌లో తృతీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థిని అభినందించి మాట్లాడారు. రాజస్థాన్‌లోని మహావీర్‌జాలో ఈ నెల 6 నుంచి 10 వరకు జరిగిన టెన్నికాయిట్ నేషనల్స్ అసోసియేషన్ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం తరుపున విద్యార్థిని పాల్గొన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ వసంత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రేణుక, జూనియర్ లెక్చరర్ వెంకటేశ్వర్లు, రవికృష్ణ, సుధారాణి, కరిష్మా పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

- సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపి



జీవామృతంపై అవగాహన కల్పిస్తున్న సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపి

నడిగూడెం, ఫిబ్రవరి 15 : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపి అన్నారు. గురువారం మండలంలోని రత్నవరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పంటపై కాండం తొలుచు పురుగు, ఆకు చుట్టూ పురుగు ఆశించి నష్ట పరుస్తాయని ఇలాంటి సమయంలో రసాయన ఎరువులకు బదులు నీమాస్త్రం, జీవామృతం తయారు చేసుకుని పిచికారి చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులు అమ్ముతున్న బీజేపీ

- ప్రశ్నిస్తే అరెస్టులు
- ఆప్ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 15 : బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మతం పేరుతో ప్రభుత్వ ఆస్తులు అమ్ముతున్నదని ఇదేమిటని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆమ్ ఆద్మీ ఆధ్వర్యంలో సామాన్యుడి సమర భేరి కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తిరుమలగ్రాండ్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వనరులెన్నో ఉన్నా పేదరికం పెరుగుతున్నదని అందుకు కారణమైన అవినీతిని సమూలంగా నిర్మూలించేందుకే ఆప్ ఆవిర్భవించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు అమ్ముతున్నారని ప్రశ్నించినందుకు ఢిల్లీలో ఆప్ మంత్రులు సిసోడియా, సత్యేందర్‌సింగ్‌పై ఈడి దాడులు చేయించి ఒక్క రూపాయి పట్టుకోకున్నా వారిని అక్రమంగా జైల్లో పెట్టారని ఆరోపించారు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్, మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. అంతకు ముందు రైతు బజార్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సూరారపు పరీక్షన్‌రాజు, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బుర్ర రాముగౌడ్, జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య, మహిళా అధ్యక్షురాడు మమత, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్, మహిళా నాయకురాలు అనూష పాల్గొన్నారు.

## పాలకవీడు ఎంపీడీఓగా లక్ష్మి బాధ్యతలు

పాలకవీడు, ఫిబ్రవరి 15 : పాలకవీడు మండల ఎంపీడీఓగా జి.లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓకు ఎంపీపీ గోపాల్, నాయకులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఎంపీడీఓ రామచందర్‌రావు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 15 : వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని దొరకుంట, చిమిర్యాల గ్రామాల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ వి.వి. రామచందర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని దొరకుంట గ్రామ పంచాయతీ కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ పైపులైన్ కనెక్షన్లు, స్థానిక వాటర్ ట్యాంకులకు కలిపి నీటి ఎద్దడిని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి జీవిత, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి

- ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 15 : చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, మాదక ద్రవ్యాలు, ర్యాష్ డ్రైవింగ్, బాల్య వివాహాల నిర్మూలన, సెల్ ఫోన్ అతిగా వాడడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీడీఎస్ ప్రసాద్, ఏఎస్ఐ బలరామ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'మత్స్యగిరి ఆలయానికి బస్సు సౌకర్యం కల్పించాలి'



నార్కట్‌పల్లి డిపో మేనజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దేవస్థానం ఈఓ మోహన్‌బాబు

వలిగొండ, ఫిబ్రవరి15 : మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రభుత్వం బస్సు సౌకర్యం కల్పించాలని ఆలయ ఈఓ మోహన్‌బాబు ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులను కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు నల్లగొండ, యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి డిపోల అధికారులకు వినతి ప్రతాలు అందజేసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలైన సంఘటన రాయగిరిలోని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లా వెల్దండకు చెందిన భార్యాభర్తలు బొల్లం సంపత్‌కుమార్, నవ్యశ్రీ హైదరాబాద్ నుంచి జనగాం వైపు బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో రాయగిరి వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నవ్యశ్రీ(25)అక్కడికక్కడే మృతిచెందగా సంపత్‌కుమార్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మృతురాలి భర్త సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

## ముందస్తు అడ్మిషన్లు చేపట్టే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతికుమార్

మోత్కూరు, ఫిబ్రవరి 15 : వచ్చే విద్యా సంవత్సరానికి గానూ ముందస్తు అడ్మిషన్లు తీసుకునే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటి నుంచే అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు సూరారం కల్యాణ్, మండల నాయకులు వినయ్, వంశీ, దినేశ్ పాల్గొన్నారు.